పోషకాల ఆహారం

- తల్లులు, చిన్నారుల ఆరోగ్య రక్షణకు చర్యలు
- క్లస్టర్ పరిధిలో పౌష్టికాహార మాసోత్సవాలు



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు(ఫైల్)

రాయవరం: పోషకాహారం ప్రాధాన్యం తెలియక, సరిగ్గా తీసుకోక తల్లులు, పిల్లలు అనేక రుగ్మతలకు గురవుతున్నారు. తినే ఆహారంలో సరైన మోతాదులో మాంసకృతులు లేకపోవడం, విటమిన్లు, ఖనిజ లవణాల లోపాల వల్ల ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. కాల్షియం తక్కువైతే ఎముకల్లో పటుత్వం తగ్గుతుంది. పోషకాహార లోపం నివారణకు, రోగ నిరోధక శక్తిని పెంచుకోవడానికి ప్రధానంగా కూరగాయలు, ఆకుకూరలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. దీనిపై ఏటా సెప్టెంబర్‌లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు. మండపేట, రామచంద్రపురం నియోజక వర్గాల్లో కూడా పౌష్టికాహార మాసోత్సవాలు గ్రామ గ్రామానా నిర్వహింటించేందుకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆదేశాలు జారీ చేసింది.

ఆరోగ్యానికి శ్రీరామ రక్ష

పెరట్లో కన్పించే తాజా కూరగాయలే మన ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని వైద్య నిపుణులు చెబుతున్నారు. వాటిని నిర్లక్ష్యం చేయడం వల్లే అనేక మంది పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. దీనికి తోడు పప్పుదినుసులు, పాలు, గుడ్లు, పండ్లు, పండ్ల రసాలతో పాటు మాంసాహారాన్ని తీసుకోవాలి. ప్రధానంగా పప్పు దినుసులు తీసుకుంటే హార్మోన్ల సమతుల్యతను కాపాడే శక్తి పెరుగుతుంది. కూరగాయలు, ఆకుకూరల్లో సూక్ష్మ పోషకాలైన విటమిన్లు, ఖనిజ లవణాలు లభిస్తాయి. వారంలో మూడు రోజుల పాటు విధిగా తీసుకోవాలి. అలాగే సీజనల్‌గా లభించే పండ్లు తీసుకుంటే పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. గర్భిణులు, బాలింతలు, ఐదేళ్ల లోపు చిన్నారుల తల్లులకు ప్రధానంగా పోషకాహారం, చేతుల పరిశుభ్రత, రక్తహీనత, నీళ్ల విరేచనాలు, ఆహారంలో వైవిధ్యంపై అవగాహన కల్పిస్తున్నారు.

పోషకాహార లోపంతో ఇబ్బందులు

మండపేట, రామచంద్రపురం నియోజక వర్గాల్లో మండపేట, రామచంద్రపురం పట్టణాలతో పాటుగా, మండపేట, మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం, రామచంద్రపురం, కె.గంగవరం మండలాలున్నాయి. ఈ మండలాల్లోని 267 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, 425 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో వేలాది మంది చిన్నారులున్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషకాహార లోపం నివారణకు కోడిగుడ్లు అందిస్తున్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పోషకాహారాన్ని వండి అందించడంతో పాటు ఉడికించిన కోడిగుడ్లు అందిస్తున్నారు.

రామచంద్రపురం, మండపేట ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని చిన్నారులు, గర్భిణులు, బాలింతల వివరాలు

	రామచంద్రపురం	మండపేట
గర్భిణులు	895	1217
బాలింతలు	1045	1124
0–6 నెలలు	1045	1124
6వ నెల–3వ సం.	3754	5034
3వ సం– 6వ సం.	2031	4177

పిల్లల ఎదుగుదలకు ఇలా

పిల్లల ఎదుగుదలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులకు నెలకు 25 కోడిగుడ్లు, 2.5 కేజీల బాలామృతం ప్యాకెట్, 2.5 లీటర్ల పాలు అందిస్తున్నారు. బాలింతలు, గర్భిణులకు నెలకు మూడు కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, అరకేజీ ఆయిల్ ప్యాకెట్, ఐదు లీటర్ల పాలు, 25 కోడిగుడ్లు అందిస్తున్నారు. అలాగే రెండు కేజీల రాగిపిండి, కేజీ అటుకులు, 250 గ్రాముల బెల్లం, 250 గ్రాముల ఖర్జూరం, 250 గ్రాముల చిక్కీలు అందిస్తున్నారు. బరువు తక్కువగా గుర్తించిన చిన్నారులకు అదనంగా ఫీడింగ్‌ను అందజేస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



ఎలాంటి ఆహారం తీసుకుంటే పోషకాలుంటాయనే దానిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పోషక పదార్థాలను తయారు చేసి ప్రదర్శనలు నిర్వహిస్తున్నాం. సామాన్య, మధ్య తరగతి ప్రజలు తమ బడ్జెట్‌కు అనుగుణంగా రోగ నిరోధక శక్తిని పెంచే పోషకాహారాలు తీసుకోవాలి. అప్పుడే ఆరోగ్యకర సమాజం సాకారమవుతుంది.

– వి.వరాహలక్ష్మి, ఐసీడీఎస్ పీవో, రామచంద్రపురం ప్రాజెక్టు

విజయవంతం చేయాలి



పౌష్టికాహార మాసోత్సవాలను అంగన్‌వాడీ కార్యకర్తలు విజయవంతం చేయాలి. పోషకాహారం తీసుకోవాల్సిన అవసరాన్ని, తీసుకోవడం కలిగే ప్రయోజనాలను మాసోత్సవాల్లో వివరిస్తున్నాం. పౌష్టికాహార మాసోత్సవాల విజయవంతానికి అవసరమైన చర్యలు తీసుకున్నాం.

– అధికారి గజలక్ష్మి, ఐసీడీఎస్ పీవో, మండపేట ప్రాజెక్టు

ముంపు వైఫల్యానికి బాధ్యత ప్రభుత్వానిదే

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



మండపేట: 'విజయవాడ వరద ముంపునకు, నష్టం ఇంత తీవ్రంగా ఉండడానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి. వరద ప్రభావం, సహాయక చర్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా బాధ్యతగా వ్యవహరించాలి. వరద ప్రాంత నివాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం వెంటనే ముందుకు సాగాలి. ముందు కాలనీల్లో సహాయక చర్యల్లో అనేక లోపాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. ఫలితంగా వరద వచ్చి వారం పైబడినా బాధితులు సమస్యల నుంచి ఇప్పటికీ బయట పడలేక పోతున్నారు. రోజు కూలి చేసుకునే సామాన్యులకు ఆపద వస్తే ఆదుకునే ప్రణాళిక ప్రభుత్వం వద్ద లేకపోవడం విచారకరం' అని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మండపేట నియోజకవర్గ కోఆర్డినేటర్ తోట త్రిమూర్తులు మంగళవారం ఓ ప్రకటనలో ఆక్షేపణ తెలియజేశారు.

ఆరోగ్య నియమాలతో వ్యాధులు దూరం

కాజులూరు: ప్రతి ఒక్కరూ ఆరోగ్య నియమాలు సక్రమంగా పాటిస్తే.. అంటువ్యాధులకు దూరంగా ఉండగలకని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్ సౌజన్య అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌజన్య మాట్లాడుతూ, వర్షాకాలం కావటంతో గ్రామాలలో అపరిశుభ్రత ఏర్పడి, అంటు వ్యాదులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రజలు ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్లను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

డిగ్రీ కోర్సులకు ఆన్‌లైన్ ప్రక్రియ

రామచంద్రపురం: కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడో విడత ఆన్‌లైన్ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కేసీ సత్యలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో చేరేందుకు వెబ్ ఆప్షన్లను ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు కొనసాగుతాయని వివరించారు. రామచంద్రపురం, పరిసర ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వినాయకుడికి వెండి తొడుగు అలంకరణ

మండపేట: గణపతి నవరాత్ర మహోత్సవాల సందర్భంగా పట్టణంలోని గాంధీనగరం ఒకటో వీధిలో నెలకొల్పిన వినాయకుడిని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తుల సహకారంతో సమకూర్చిన వెండి తొడుగును వినాయకుడికి ఆయన చేతుల మీదుగా అలంకరించారు. నాల్గో రోజు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహించి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో అల్లక శ్రీనివాస్, జట్ల రాంబాబు, ఆంద్ర శ్రీను, గోరు సత్తిబాబు, అల్లక పర్వత మల్లికార్జునరావు, ముప్పన రామారావు, గోరు వీర్రాజు, ఆంద్ర ధనరాజు, వీరవరపు శ్రీను, వాసా రవికిరణ్, పులగాల బాలాజీ, అల్లక రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయంగా విద్యుత్ ఉద్యోగుల ఒక రోజు వేతనం

మండపేట: విజయవాడ వరద బాధితులకు తమ వంతు సాయంగా ఒక రోజు వేతనాన్ని అందిస్తున్నట్టు విద్యుత్ ఉద్యోగుల సంఘం రామచంద్రపురం డివిజన్ కార్యదర్శి రాజ్ కుమార్ మంగళవారం మీడియాకు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరద బాధితులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యుత్ ఉద్యోగులంతా ఒక రోజు వేతనాన్ని విరాళంగా ప్రకటించారన్నారన్నారు.

నాలుగో వార్డులో వైద్య శిబిరం



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది తదితరులు

మండపేట: పట్టణంలోని నాల్గో వార్డులో ఆ వార్డు కౌన్సిలర్ గుండు రామతులసి, తాతరాజు దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఇటీవల వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల వల్ల ప్రజలకు వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున్న తమ వార్డులో వైద్య శిబిరాన్ని నిర్వహించామని తులసి తెలిపారు. వార్డులో ఇంటింటికీ తిరిగి జ్వరం, దగ్గు, జలుబు వంటి వ్యాధులు ఉన్నవారిని గుర్తించి వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వారోగ్య సిబ్బంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముఖ్యంగా జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీలు మధురిక, విజయ, ఆశా వర్కర్లు నాగమణి, ఉమ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యుల నిరసన

రాజోలు: పీహెచ్‌సీల్లో సేవలందిస్తున్న వైద్యులకు జీఓ 85 తీవ్ర నష్టం కలిగిస్తుందని మంగళవారం తాటిపాక పీహెచ్‌సీ వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రాథమిక వైద్యశాల ఆస్పత్రి వైద్యుల సంఘం పిలుపు మేరకు దశలవారీగా నిరసన వ్యక్తం చేస్తున్నామని డాక్టర్ సీహెచ్ ఫణికిరణ్ తెలిపారు. జీఓ ద్వారా వైద్యులకు మూడేళ్ల సర్వీసు నిర్వీర్యం అవుతుందన్నారు. జీఓ ద్వారా పీజీ అవకాశాలు తగ్గించడం దారుణమన్నారు. ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో సేవలను ప్రభావితం చేస్తుందన్నారు. జీఓను రద్దు చేయాలని ఉన్నతాధికారులకు, శాసన సభ్యులకు వినతిపత్రాలు అందించినా ఫలితం లేదన్నారు. వైద్య సేవలకు అంతరాయం లేకుండా, ఈ నెల 12 వరకు నిరసన చేపడతామన్నారు. ఈ నెల 13, 14వ తేదీల్లో అత్యవసర సేవలు మినహా, మిగిలిన ఇతర విధులను పూర్తిగా బహిష్కరిస్తామన్నారు. 15న యలో విజయవాడ ర్యాలీ, 16న నిరవధిక నిరాహార దీక్ష చేపట్టాలని రాష్ట్ర యూనియన్ పిలుపునిచ్చిందన్నారు.

ఘనంగా సామూహిక సీమంతాలు

ఆలమూరు: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మూలస్థాన అగ్రహారంలో మంగళవారం సామూహిక సీమంతాలు జరిగాయి. గ్రామ అంగన్‌వాడీ కార్యకర్తల సమాఖ్య ఆధ్వర్యంలో18 మంది గర్భిణులకు శాస్త్రోకంగా పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు పాల్గొని గర్భిణులకు అక్షింతలు వేసి, పండంటి బిడ్డకు జన్మనివ్వాలని దీవించారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

- డ్వామా పీడీ మధుసూదనరావు
- మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక
- పాలతోడు ఫీల్డ్ అసిస్టెంట్ రాజేశ్వరి సస్పెన్షన్



సామాజిక తనిఖీలో రికార్డులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ మధుసూదనరావు

మండపేట: ఉపాధి హామీ పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ మధుసూదనరావు హెచ్చరించారు. గ్రామీణ ఉపాధి హామీ పనులకు సంబంధించి మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. డ్వామా పీడీ మధుసూదనరావు హాజరై తనిఖీలు నిర్వహించారు. రికార్డుల పరిశీలన చేస్తుండగా పాలతోడు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ రాజేశ్వరి పాల్పడిన అవకతవకలు బయటపడ్డాయి. ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే ఉపాధి జాబ్ కార్డు ఇవ్వాల్సి ఉండగా ఒకే కుటుంబంలో ఇద్దరేసి చొప్పున మొత్తం ఐదు కుటుంబాలకు జాబ్‌కార్డులు జారీ చేసినట్టు డ్వామా పీడీ నిర్ధారించారు. దాంతో పాలతోడు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ రాజేశ్వరిను సస్పెండ్ చేసినట్టు పీడీ మధుసూదనరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకూ మండలంలో నిర్వహించిన వివిధ ఉపాధి పనులపై సామాజిక తనిఖీ చేశారు. గత నెల 30 నుంచి తనిఖీలు నిర్వహిస్తున్నట్టు డీఎల్‌పీవో ఐదం రాజు తెలిపారు. ఐదం రాజు అధ్యక్షతన నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఎంపీడీవో కె. సత్యనారాయణమూర్తి, విజిలెన్స్ అధికారి భీమేశ్వరరావు, అంబుడ్స్‌మన్ ఏపీ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు (నాగబాబు), మారేడుబాక సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవాలు



వెదురుపాకలో లక్ష్మీగణపతి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

రాయవరం: మండలంలోని వెదురుపాక దేవుడి మాన్యం కాలనీలోని లక్ష్మీగణపతి ఆలయ తొలి వార్షికోత్సవ పూజలు మంగళవారం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామానికి చెందిన వైఖానస పండితుడు అంగర జనార్దనాచార్యులు, శివాలయం అర్చకుడు పల్లంరాజు తొలుత గణపతిని పల్లకీలో ఊరేగించారు. పలు రకాల పూజలు, మహా నివేదన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చెల్లూరి శ్రీనివాస్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రాణం విలువ తెలుసుకోండి



రాజోలు సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సాయిబాబు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీసుధ

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబు

రాజోలు: ప్రాణం విలువ తెలిస్తే ఆత్మహత్యలు చేసుకోవాలనే ఆలోచన దూరమవుతుందని రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబు అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణా దినాన్ని పురస్కరించుకుని మంగళవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సాయిబాబు మాట్లాడుతూ, చిన్న కారణాలతో క్షణికావేశానికి లోనై అనేక మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఒత్తిడిని దూరం చేసుకుని, మానసిక ప్రశాంతతకు, యోగా, ధ్యానం వంటి ప్రక్రియలను అలవర్చుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ టీఎస్‌వీ పద్మనాభం, అధ్యాపకులు శైలజ, అశ్వని, ఎన్ఎస్ఎస్ పీఓ నల్లి రాజు, సరిత తదితరులు పాల్గొన్నారు.

విజయాన్ని అందుకోవాలంటే..

మలికిపురం: కష్టాలు, అపజయాల వంటివి జీవితంలో ఎదురవుతుంటాయని, వీటిని ఎదుర్కొంటేనే విజయాలను అందుకోగలరని ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పీవీవీ వరప్రసాద్ అన్నారు. స్థానిక దీప్తి మహిళా కళాశాలలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం జరిగింది. ప్రిన్సిపాల్ శ్రీసుధ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మన చేతుల్లోనే జీవితం ఉందని, మంచి ఆలోచనలతో ఆనందకరమైన జీవితాన్ని ఆస్వాదించాలని చెప్పారు. నిత్యం వ్యాయామం, మంచి ఆహారం, ప్రకృతి ఆస్వాదన, సేవా దృక్పథం వంటివి అలవర్చుకుంటే జీవితం ఆనందదాయకం అవుతుందన్నారు. నిరాశను విడిచి, సరైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. సామాజిక కార్యకర్త తాడి సహదేవ్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి వారి తల్లిదండ్రుల కష్టాన్ని తెలుసుకుని ప్రవర్తించాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షుడు ఎస్.రమేష్‌బాబు, అధ్యాపకులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు మౌలిక సౌకర్యాల కల్పన



ప్రభుత్వ పథకాలపై ఆదివాసీలకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జ్ కమిషనర్ కనకరాజు

మండపేట: పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా షెడ్యూల్ తెగల కుటుంబాలు నివసిస్తున్న ప్రాంతాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలు, పక్కా గృహాలు, రోడ్డు నిర్మాణం, పిల్లలకు విద్యా సౌకర్యం వంటి కనీస సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మండపేట ఇన్‌చార్జ్ కమిషనర్ టి.కనకరాజు అన్నారు. పట్టణంలోని 2వ వార్డు గొల్లలగుంట వీధిలోని సచివాలయం వద్ద మంగళవారం జన జాతి ఆదివాసీ న్యాయ మహాభియాన్ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న మండపేట హౌసింగ్ కార్పొరేషన్ ఏఈ మూర్తి ఆదివాసీల సమస్యలపై చర్చించారు. ఆదివాసీలను అన్నివిధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో 2వ వార్డు సచివాలయం అడ్మిన్ ఎల్. దొరబాబు, మున్సిపల్ సిబ్బంది, ఆదివాసీలు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలకు కృషి చేయాలి



సిబ్బందితో చర్చిస్తున్న వైద్యాధికారి, ఎంపీడీఓ

కపిలేశ్వరపురం: స్థానిక సీహెచ్‌సీలో రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు మరింత కృషి చేయాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో నిర్ణయించారు. స్థానిక ఆసుపత్రిలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వైద్య సేవలు, మందుల లభ్యత, రక్త పరీక్షలు తదితర అంశాలపై చర్చించారు. ఎంపీడీఓ కొండలరావు పర్యవేక్షణలో ఆసుపత్రిలో సేవలపై సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్‌కుమార్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కన్వీనర్ రాజ్‌కుమార్ సమక్షంలో చర్చించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి శివ చక్రవర్తి, డాక్టర్ సారథి, డాక్టర్ జి.శ్రావణి, డాక్టర్ కె.శ్రావణి, డాక్టర్ దుర్గాదేవి మాట్లాడారు.

ప్రకృతిని శాసించడం అసాధ్యం

అంబాజీపేట: సృష్టిలో ప్రకృతిని శాసించడం ఎవరి వల్లా కాదని, వేదాధ్యయనం, పఠనం ద్వారా దానిని అదుపు చేయవచ్చని శ్రీపాద మాణిక్య అవధాని, ఆకెళ్ల నరసింహ సోమయాజులు అన్నారు. ఇరుసుమండలో ఆకెళ్ల శ్రీవేంకట సత్యనారాయణ సిద్ధాంతి స్వగృహంలో మంగళవారం వేద సభ జరిగింది. ఈ సందర్భంగా సభకు ముఖ్య ఆతిథులుగా హాజరైన శ్రీపాద మాణిక్య అవధాని, ఆకెళ్ల నరసింహ సోమయాజులు మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, సంప్రదాయలు, నేటి వైజ్ఞానిక ఆవిష్కరణలు, ఏనాడో వేదాల్లో నిక్షిప్తమై ఉన్నాయన్నారు. జపాన్, జర్మనీల్లో భారతీయ వేదాలను వారి భాషల్లోకి తర్జుమా చేసుకుని, పరిశోధనలు చేస్తున్నారన్నారు. అనంతరం సిద్ధాంతి సత్య నారాయణమూర్తి, తన తల్లి అనంతలక్ష్మితో కలిసి వేద పండితులను సత్కరించారు. వివిధ ప్రాంతాలకు చెందిన వేద పండితులు పాల్గొన్నారు.

నేత్ర పరిరక్షణ సేవ ప్రశంసించదగినది

- కోరుమిల్లిలో ఉచిత నేత్ర శుక్లం చికిత్సా శిబిరం ప్రారంభం



చిన కోరుమిల్లిలో కంటి పరీక్ష చేస్తున్న నిపుణురాలు

కపిలేశ్వరపురం: జీవన గమనానికి మార్గదర్శిగా నిలిచే నేత్రాలను పరిరక్షించేందుకు చేపట్టే సేవా కార్యక్రమాలు ప్రశంసించదగినవని ఉచిత నేత్ర శుక్లం చికిత్సా శిబిరం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. మండలంలోని కోరుమిల్లి గ్రామ శివారు చిన కోరుమిల్లిలో లంకా విజయ, మెహర్‌చంద్, బులుసు, భమ్మిడిపాటి కుటుంబ సభ్యులు, చెన్నైకు చెందిన శంకర నేత్రాలయ వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. శిబిరాన్ని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, వేగుళ్ళ లీలాకృష్ణతో కలసి ప్రారంభించారు. బులుసు కనకదుర్గ, వెంకట సత్య సుబ్రహ్మణ్యశర్మ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని ఈ నెల 16 వరకూ కొనసాగించనున్నారు. 14 వరకూ నేత్ర పరీక్షలు చేసి అవసరమైన వారికి 15, 16 తేదీల్లో స్థానికంగానే శస్త్ర చికిత్సలు చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆచంట సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు సుంకర వెంకటేశ్వరరావు, క్యాంపు కో -ర్డినేటర్ భైరంరాజు, ఆప్తమాలజిస్ట్ ఐశ్వర్య, సిబ్బంది వెంకటేష్, సత్యరాజ్, కృష్ణమూర్తి, ప్రశాంత్, భాను ప్రసాద్, మహేష్ సేవలందించారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



ద్రాక్షారామలో విరాళాలు సేకరిస్తున్న నాయకులు

రామచంద్రపురం రూరల్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మంగళవారం ద్రాక్షారామలో విరాళాల సేకరణ చేపట్టారు. చిరు వ్యాపారులు, వర్తక, వాణిజ్య సంస్థల నుంచి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ మాట్లాడుతూ, దయనీయ స్థితిలో ఉన్న విజయవాడ, దాని పరిసర ప్రాంతాల ప్రజలకు మానవతా దృక్పథంతో సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం, పీడీఎస్‌యూ నాయకులు నవీన్, హరీష్, సాయి చరణ్ పాల్గొన్నారు.

మళ్లీ గోదావరి వరద భయం



కపిలేశ్వరపురం వద్ద గోదావరి వరదను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్సై తదితరులు

- భయాందోళనలో తీర ప్రాంత ప్రజలు

కపిలేశ్వరపురం: మళ్లీ గోదావరి వరద భయం అలముకుంటోంది. ఇటీవల ఉగ్ర రూపం దాల్చిన గోదావరి శాంతించడంతో తీర ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం గోదావరి ప్రవాహం మరోసారి ఉధృతమైంది. భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసే పరిస్థితులు ఉన్నట్టు సమాచారం నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గోదావరి నిండుకుండను తలపిస్తోంది. దీంతో తహసీల్దార్ చిన్నారావు, అంగర ఎస్సై రవికుమార్‌లు కపిలేశ్వరపురం పుష్కర ఘాట్ వద్ద వరద పరిస్థితిని పరిశీలించారు. నీటిమట్టం మరింత పెరిగితే మండలంలోని కేదారిలంక, అద్దంకివారిలంక, నారాయణలంక, వీధివారిలంక గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాలను తాకే ప్రమాదం పొంచి ఉంది. అదే సంభవిస్తే వ్యవసాయ క్షేత్రాల్లోని పశువులను గ్రామంలోకి తరలించాల్సి వస్తుంది. ఇప్పటికే పలు మార్లు వరద రావడంతో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి.

జార్ఖండ్ మాదిరి లాయర్లకు సౌకర్యాలు కల్పించాలి

మండపేట: న్యాయవాదుల సంక్షేమానికి దేశంలోనే తొలిసారిగా జార్ఖండ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శవంతమైన చర్యలు చేపట్టిందని సర్ కూర్మా వెంకటరెడ్డి నాయుడు సామాజిక అభివృద్ధి విషయాల అధ్యయన సంస్థ వ్యవస్థాపక చైర్మన్, హైకోర్టు న్యాయవాది టీవీ గోవిందరావు అన్నారు. న్యాయవాదులకు రూ.5 లక్షల ఆరోగ్య బీమా, 65 ఏళ్లు పైబడినవారికి నెలకు రూ.14 వేల పెన్షన్, కోర్టుల్లో కొత్తగా పేర్లు నమోదు చేసుకున్న అడ్వొకేట్లకు నెలకు రూ.5 వేల స్టైఫండ్ ఇచ్చేందుకు సీఎం హేమంత్ సోరెన్ అధ్యక్షతన ఇటీవల జరిగిన జార్ఖండ్ రాష్ట్ర క్యాబినెట్ సమావేశం ఆమోదం తెలిపిందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని న్యాయవాదులకు జార్ఖండ్ ప్రభుత్వం మాదిరిగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఈ సందర్భంగా టీవీ గోవిందరావు కోరారు.

దాహార్తితో విద్యార్థుల విలవిల

నిరుపయోగంగా ప్యూరిఫై వాటర్ ఫిల్టర్



తొండవరం జెడ్పీ హైస్కూల్‌లో నిరుపయోగంగా ఉన్న ప్యూరిఫై వాటర్ ఫిల్టర్

అంబాజీపేట: తొండవరం జెడ్పీ హైస్కూల్‌లో తాగునీరు లేక విద్యార్థులు దప్పికతో అలమటిస్తున్నారు. నాడు నేడు పథకంలో భాగంగా 2020లో మంజూరు చేసిన ప్యూరిఫై వాటర్ ఫిల్టర్ గత ఎనిమిది నెలలుగా నిరుపయోగంగా ఉందని స్థానికులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఈ వాటర్ ఫిల్టర్‌కు మంచినీటి ట్యాంకు నుంచి సరఫరా చేయకుండా, కేవలం బోరు వాటర్‌ను సరఫరా చేయడంతో తరచూ మరమ్మతులకు గురవుతోంది. నందంపూడి మంచి నీటి ట్యాంకు పైపులైన్ జెడ్పీ హైస్కూల్‌కు సమీపంలో ఉన్నా, దానిని అమర్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. విద్యార్థుల తాగునీటి అవసరాలకు స్థానికులు ప్రతి రోజు 5 వాటర్ టిన్లను దాతలు పంపిణీ చేస్తున్నారని ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు, పీఎంసీ చైర్మన్ పేరాబత్తుల వెంకటసుబ్బారావు, నేదునూరి మురళీకృష్ణ బుధవారం తెలిపారు. వాటర్ ఫిల్టర్‌కు మరమ్మతులు చేయిస్తే వినియోగంలోకి వస్తుందని, దీని పార్టులు దొరక్క పోవడంతో టెక్నీషియన్ రావడం లేదని ఉపాధ్యాయులు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థుల దాహార్తిని తీర్చాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.

మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం



సీఐ రుద్రరాజు భీమరాజు

అంబాజీపేట: నియోజకవర్గ పరిధిలో మాదక ద్రవ్యాల నేరాలపై ఉక్కుపాదం మోపుతామని పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు అన్నారు. అంబాజీపేట పోలీస్ స్టేషన్‌లో పి.గన్నవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలను ఆయన మంగళవారం స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక సీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, ఇటీవల కాలంలో మాదక ద్రవ్యాల వినియోగం ఎక్కువైనట్టు తెలిసిందన్నారు. యువత మాదకద్రవ్యాలకు బానిసలుగా మారుతూ, భవిష్యత్తును నాశనం చేసు కుంటున్నారన్నారు. మాదక ద్రవ్యాలను విక్రయించే, వినియోగించే వారిపై నిరంతర నిఘా ఉంచుతామన్నారు. మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులకు పాల్పడే వారిపై నూతన చట్టాల ఆధారంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అంబాజీపేట సెంటర్లో సాయంత్రం వేళ ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, సమస్య పరిష్కారానికి అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాఉండగా ఈయన మారేడుమిల్లి సీఐగా పనిచేస్తూ బదిలీపై అంబాజీపేట వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా ఉన్న డి.ప్రశాంత్‌కుమార్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ కార్యాలయంలో రిపోర్ట్ చేశారు.

విఘ్నేశ్వరునికి సీఐ పూజలు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారిని పి.గన్నవరం సీఐ భీమరాజు మంగళవారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. సీఐగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఆయన తొలిసారి అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.